కనక మహాలక్ష్మికి విశేష పూజలు



భక్తుల పూజలందుకుంటున్న కనక మహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం 25వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, భక్తులు పాల్గొన్నారు.



ఎర్నిమాంబకు ఏకాదశి పూజలు

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 దర్శనాలు కల్పించారు. ఈ నేపథ్యంలో వర్షాలు పడుతుండడంతో క్యూలైన్‌లో షెడ్లు నిర్మించాలని భక్తులు కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు తదితర సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.


ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

స్వచ్ఛమైన తాగునీటితో సంపూర్ణ ఆరోగ్యం


వాటర్ ప్యూరిఫయర్ అందజేసి ప్రారంభిస్తున్న అమరేష్

డాబాగార్డెన్స్ : స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించడం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చని జేసీఐ విశాఖ వేలీ సంస్థ అధ్యక్షుడు అమరేష్ తెలిపారు. నగరంలోని దండుబజార్ ఎంవీడీ స్కూల్లో జేసీఐ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫయర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీఐ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం పాఠశాల విద్యార్థులకు తాగునీరు, శానిటేషన్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. వారం రోజుల పాటు పలు అంశాలపై అన్ని వర్గాల ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీఐ సెక్రటరీ ఇంద్రజ, పూర్వ అధ్యక్షుడు ప్రవీణ్, డెంటల్ డాక్టర్ విఠల్‌కుమార్, డాక్టర్ మురళీకృష్ణ, సురేష్, సింధూర తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరానికి చెందిన కె.కుమార్ దంపతులు లక్ష 116 రూపాయల విరాళం అందజేశారు. అలాగే స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం తరఫున సూపరింటెండెంట్ అన్నప్రసాద పథకం బాండ్ దాతకు అందజేశారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణంలో పాల్గొన్న భక్తులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

- విశేషంగా ఏకాదశి పూజలు


స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు,

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సందడి కనిపించింది. అప్పన్నకు ఆర్జిత సేవలు వైభవంగా జరిపారు. ఉదయం7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసంహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

అభివృద్ధి పనులు చకచకా..

- 24వ వార్డులో జోరుగా నిర్మాణాలు
- రూ.8 లక్షలతో ఇందిరా గాంధీ పార్కు ఆధునికీకరణ


అంగన్‌వాడీ సెంటర్‌పై నిర్మిస్తున్న అదనపు అంతస్తు


నక్కవానిపాలెం ఇందిరా గాంధీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నక్కవానిపాలెంలోని ఇందిరా గాంధీ పార్కును ఆధునీకీకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. 1985లో నక్క రామకృష్ణారెడ్డి కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు ఇందిరా గాంధీ పార్కు నిర్మాణ ం చేపట్టారు. 1993 నవంబర్ 19న అప్పటి రాజ్యసభ సంభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి బలిరెడ్డి సత్యారావు, ఇందిరా గాంధీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు నక్క రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మొదట్లో ఎంతో ఆహ్లాదంగా ఉండే ఈ పార్కు.. కాలక్రమేణా అధ్వాన స్థితికి చేరింది. కొన్నేళ్లుగా పర్యవేక్షణ లేకపోవడంతో ఈ ఉద్యానవనంలోని పరికరాలు తుప్పుపట్టి పాడైపోయాయి. పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా పర్యవేక్షించే వారు కరువై పార్కులో సాయంత్రం వేల స్థానికులు కూర్చోడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. పరిసరాలు, పరికరాలు పాడైపోయి కళావిహీనంగా తయారైంది. ఈ నేపథ్యంలో ఇందిరా గాంధీ ఉద్యానవనానికి పూర్వవైభవం తీసుకొచ్చేలా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. పార్కు మరమ్మతులు, అభివృద్ధి కోసం జీవీఎంసీ నిధులు రూ.8 లక్షలు విడుదల చేశారు. దీంతో స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఇటీవల శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తి చేశారు. మరి కొద్ది రోజుల్లో మొత్తం పనులు ముగించి పార్కును స్థానికులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

అంగన్‌వాడీపై అదనపు అంతస్తు

నక్కవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనంపై డ్వాక్రా మహిళల కోసం అదనపు అంతస్తు నిర్మిస్తున్నారు. సుమారు రూ.15 లక్షలతో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి వినాయక ప్రతిమలే వినియోగించాలి

భీమునిపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమలను మాత్రమే వినియోగించాలని స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ కుమారి మహాలక్ష్మి సూచించారు. విద్యాలయం వద్ద విశాఖ గ్రీన్ క్లైమేట్ టీం సహకారంతో విద్యార్థినులు మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన ప్రతిమల వల్ల పర్యావరణానికి ఎంతో ముప్పు ఏర్పడుతుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే వినియోగించాలని, ఇక్కడి విద్యార్థినులు తయారుచేసిన వాటిని అందరికీ అందజేస్తామని తెలిపారు. టీం ప్రతినిధులు రాజేశ్వరి, రవితేజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఆర్‌వోకు అభినందన



నూతన డీఆర్‌వో మోహన్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉద్యోగ సంఘం ప్రతినిధులు

మహారాణిపేట : జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కె.మోహన్‌కుమార్‌ను ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు అభినందించారు. డీఆర్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వియ్యపు నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈగల శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఒమ్మి పెద్దారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌డీవో

మహారాణిపేట : సోమవారం విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సైన్ సాహెబ్ డయల్ యువర్ ఆర్‌డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాలకు చెందిన తహసీల్దార్లు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోనున్నారు. 0891–2562977 నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు సమస్యలు తెలియజేయవచ్చు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

మణిపూర్ హింసపై దృష్టి సారించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దాబాగార్డెన్స్ : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ వైజాగ్ క్రిస్టియన్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో మెగా రివైవల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ ఎంపీ పాల్, రెవరెండ్ డాక్టర్ అనిల్‌పాల్, డాక్టర్ విక్రాంత్ మీడియాతో మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన భయంకర హింసను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దాడులను తక్షణమే అరికట్టాలన్నారు. అనేక మంది క్రైస్తవులను చంపుతున్నారని, వారికి తగిన న్యాయం కూడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తక్షణమే న్యాయం చేయాలని విశాఖ క్రైస్తవులు కోరుతున్నారన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వాలతో పూజలందుకున్న శివయ్య

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం సాయినగర్‌లోని కాశీ విశ్వేశ్వరాలయంలో శ్రావణ బహుళ ఏకాదశి సందర్భంగా ఆదివారం పార్వతీ పరమేశ్వరులకు లక్ష బిల్వార్చన, కుంకుమార్చన పూజలు విశేషంగా నిర్వహించారు. దేవదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు అందుకూరి శివాజీశర్మ వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించినట్టు ఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన హిందీ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన హయ్యర్, లోయర్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ రెండు రోజుల్లో 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలు రాసినట్టు భీమిలి నెహ్రూ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

వివిధ వర్ణాలు.. పలు రూపాల్లో..

- అమ్మకానికి సిద్ధమైన వినాయక ప్రతిమలు
- ఆకట్టుకుంటున్న కోల్‌కతా స్పెషల్ ప్రతిమలు



వివిధ రూపాలలో వినాయక ప్రతిమలు



వినాయక ప్రతిమలను పరిశీలిస్తున్న కొనుగోలుదారులు







అల్లిపురం : వినాయక చవితి అమ్మకాలకు ప్రతిమలు సిద్ధమయ్యాయి. ప్రకృతి ప్రేమికులు మట్టి వినాయకులనే పూజించాలని చెబుతున్నారు. పర్యావరణ హితంగా మట్టి ప్రతిమలను వ్యాపారులు అమ్మకానికి సిద్ధం చేశారు. అల్లిపురంలో కోల్‌కతా గంగానది మట్టితో చేసిన ప్రతిమలు అమ్మకానికి కొలువుదీరాయి. రూ.50 నుంచి రూ.10 వేల వరకు వివిధ సైజుల్లో రకరకాల డిజైన్లలో రంగు రంగుల వినాయక ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాది ధరలు కూడా పెరిగిపోయాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. ముడి సరకుల ధరలు పెంచటంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వ్యాపారులు పేర్కొన్నారు. ఇక్కడికి నగరంలో అన్ని ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు రావటం విశేషం. ధర పెరిగినా గణేశుని పూజించేందుకు నగర ప్రజలు సిద్ధమవుతున్నారు.

ప్రతి ఏడాది ఇక్కడే బొమ్మలు కొంటాం..



ప్రతి ఏడాది వినాయక చవితికి ఇక్కడే బొమ్మలు కొంటాం. ధరల మాట ఎలా ఉన్నా బొమ్మల తయారీ చూడచక్కగా ఉంటుంది. స్వచ్ఛమైన మట్టితో తయారు చేస్తారు.

– యాండ్ర బాబూరావు, పరవాడ

అందమైన బొమ్మలు లభిస్తాయి..



ఎక్కడా చూడని మోడల్స్ ఇక్కడ దొరుకుతాయి. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వస్తుంటారు. అందరికీ అనువైన ధరల్లో ఇక్కడ వినాయక బొమ్మలు దొరుకుతాయి.

– బి.చక్రి, అల్లిపురం

గిట్టుబాటు కావటం లేదు..



కోల్‌కతా నుంచి కంటైనర్లలో వినాయక బొమ్మలు తీసుకువచ్చాం. కిరాయి రేట్లు పెరిగిపోయాయి. ట్రావలింగ్ ఖర్చులు కూడా అలాగే ఉన్నాయి. నష్టమైనా, లాభమైనా ప్రతి ఏడాది బొమ్మలు తీసుకువచ్చి విక్రయిస్తుంటాం. దశాబ్ద కాలానికి పైగా ఈ వ్యాపారం చేస్తున్నాం.

– బొట్టా రమేష్, వ్యాపారి

వినాయక ఉత్సవాలకు శ్రీకారం



శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

అల్లిపురం : ఈ నెల 18 నుంచి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు నగర యువత సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాల 18వ వార్షికోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవాలయం రోడ్డులో జరిగిన పందిరిరాట కార్యక్రమంలో జీకే ఫౌండేషన్ చైర్మన్ భీశెట్టి గోపీకృష్ణ, వసంతలక్ష్మి, ఆకుల రాజు దంపతులు పందిరి రాటకు పూజలు చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు వినాయక పందిరి నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా వినూత్న రీతిలో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా వినాయకుడిని వినూత్నంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు, స్థానిక యువకులు

మద్రిపాలెం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం 51వ వార్డులో పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. కళింగనగర్ వుడా క్వార్టర్స్ సమీపంలో శ్రీ వినాయక వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి పందిరి రాట వేశారు. అనంతరం విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు వార్డు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించా రు. సమాజంలో మద్యం షాపుల వద్ద అల్లర్లు చేయకుండా ఉండాలని, తగాదా ల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించా రు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా జీవించా లని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్ల ను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

90 మందికి దంత వైద్య పరీక్షలు



బాలికకు దంత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కల్యాణ్

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మాధవధార సమీపంలోని బాలికల వసతి గృహంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. టయో ల్యాబ్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 90 మంది బాలికలకు దంత సంబంధిత సమస్యలపై దంత వైద్యుడు డాక్టర్ డి.కల్యాణ్ పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో సేవలు అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, పూర్వ అధ్యక్షురాలు ఇ.శిరీష, కార్యదర్శి ఎస్.పుష్పలత, జాలీ వాకర్ ఎ.మాధవీలత, ఆరోహణ ట్రైబల్ సొసైటీ అధినేత యు.సురేఖ పటాన్నాయక్, హాస్టల్ వార్డెన్ గిరీశ్వరి, టయో లాబ్స్ టెక్నీషయన్ రమేష్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సీతంపేట: ఎల్ఎఫ్‌సీ మ్యూజికల్ ఫ్యామిలీ బ్యానర్‌పై ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు కరకవలస భాస్కర్, కె.అరుంధతి, కుమారి, జోషిత, సాత్విక ఆలపించిన సినీ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో దర్శకులు రెడ్నం యాద్‌కుమార్, జి.వి.త్రినాథ్, గిన్నిస్ రికార్డు హోల్డర్ కోరుకొండ రంగారావు పాల్గొన్నారు.

సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీమణులు

భద్రం పార్కులో హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: స్థానిక భద్రం పార్కులో పలువురు ఆధ్యాత్మికవేత్తలు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భారతదేశ సనాతన ధర్మ రాజ్య స్థాపనలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందూ ధర్మ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా యజ్ఞాన్ని నిర్వహించారు. చింతామని భజన బృందంతో పాటు కర్ణాటక సంగీత విద్వాంసులు గుమ్మలూరి శారదా సుబ్రహ్మణ్యం తదితరులు వేయి మంది భక్తులతో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన చేయించారు. ఈ కార్యక్రమంలో కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణా దంపతులు పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వితరణ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు డెయిరీ ఫారం సమీప ఇందిరానగర్‌లో ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వాయిస్ ఆఫ్ యూత్ స్వచ్ఛంద సంస్థ సహకారం అందించింది. సంస్థ సభ్యులు ఇక్కడ బాలురు, ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవధూతకు నిత్యావసర సరకులు ఆదివారం అందజేశారు. నోటు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగులు, తదితర వాటిని కూడా పంపిణీ చేశారు. బాలురు క్రమశిక్షణతో చదువుకోవాలని సంస్థ సభ్యులు సూచించారు.

లలితానగర్‌లో కూలిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం లలితానగర్‌లోని సాక్షి కార్యాలయం పక్క రోడ్డులో చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి కూలిన చెట్టును తొలగించేలా చర్యలు చేపట్టి రాకపోకలకు మార్గం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపేదలకు సేవలందించడం అభినందనీయం



సన్నీని సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తదితరులు

దాబాగార్డెన్స్ : నిరుపేదలకు సేవలందించటం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. మోర్ప చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరాశ్రయులకు సేవలందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ మోర్ప సన్యాసిరావు (సన్నీ)ని ప్రశంస దీపిక కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హాల్లో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాల్గొన్న దాడి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వద్ద పని చేస్తూ నిరుపేదలకు తన వంతు సాయంగా సేవలందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లివింగ్ స్టన్ ట్రస్ట్ సభ్యుడు నరేంద్ర కుమార్, ప్రకాష్, మా ఉపాధ్యక్షుడు, సినీ నటుడు రవితేజ, మాదాబత్తుల రమేష్, గోపాలకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సహజ యోగాతో సుఖమయ జీవితం



సహజ యోగ మందిరంలో పూజలు చేస్తున్న సహజ యోగులు

దాబాగార్డెన్స్ : ప్రతి ఒక్కరూ సహజ యోగాను క్రమం తప్పకుండా ఆచరించి ఆనందకరమైన, ఆరోగ్యప్రదమైన జీవితాన్ని అనుభవించాలని సహజ యోగులు ధర్మసాయి, సుభాషిణి, రమేష్ పద్మావతి తెలిపారు. ఆదివారం నగరంలోని సహజ యోగ ధ్యాన మందిరం ప్రారంభ కార్యక్రమంలో మందిరం స్టేట్ కో ఆర్డినేటర్ కె. స్వామిబాబు, నేషనల్ ట్రస్ట్ మెంబర్ టి. మధుసూదన్‌రావు, ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎం. రమేష్ పాల్గొని మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి నిత్య జీవితంలో అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే గంట పాటు సహజ యోగా తప్పని సరిగా చేయాలన్నారు. నేటి యాంత్రిక జీవనంలో సహజ యోగం మనిషి జీవన ప్రమాణాన్ని పెంపొందించేందుకు, ఒత్తిడిని జయించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నేటి ఆధునిక యుగంలో ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటిని జయించేందుకు సహజ యోగ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాతాజీ నిర్మలాదేవి, రమేష్, సోంబాబు, మధుసూదన్, ధర్మసాయి, కెప్టెన్ బాబూరావు, పలువురు సహజ యోగులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన వారాహి కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన ప్రణవలయ పాహి బృంద నృత్యాంశంతో ప్రారంభమైంది. కళాకారులు తమ నృత్యాభినయంతో ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. కళాకారులు మనోజ్ఞ, రమ్యశ్రీ, విధిత, హైమశ్రీ, సాయిదీక్షిత, జ్యోత్స్న, గీతాన్సీ, శృతి పాల్గొనగా.. ఎస్.పరమేశ్వరి నృత్య దర్శకత్వం వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, బాలమోహన్‌దాస్

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్తంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన నలుగురిని సత్కరించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మురహరిరావు ఉమాగాంధీ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కె.వి.ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొట్టాన రాంబాబు, విజయ్ సుశీల్ కుమార్‌లను ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు చేతుల మీదుగా సత్కరించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బి.రామారావు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కండలతో ఖండాంతరాలు దాటి..

బాడీబిల్డింగ్‌లో హేమంత్ అంతర్జాతీయ ఖ్యాతి

సింధియా : కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని గిన్ని హేమంత్ కుమార్ నిరూపించాడు. బాడీబిల్డింగ్‌లో అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటుకుంటున్నాడు. పేదింట్లో పుట్టినా దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదిగాడు. బలంగా లక్ష్యాన్ని నమ్ముకుంటే పేదరికం అడ్డుకాదని చాటి చెప్పాడు.

జీవీఎంసీ 62వ వార్డు పరిధి అల్లూరిసీతారామరాజుకాలనీకి చెందిన గిన్ని హేమంత్‌కుమార్ బాడీబిల్డింగ్‌లో విశేషంగా రాణిస్తున్నాడు. చిన్నతనం నుంచి వ్యాయామంపై ఉన్న ఆసక్తితో పేదరికాన్ని పక్కన పెట్టి ఇంటి వద్దనే శిక్షణ పొందుతూ అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన ఇవ్వాలనుకున్న కలను నెరవేర్చుకున్నాడు. నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మిస్టర్ ఆసియా 55వ బాడీ బిల్డింగ్ కాంపిటేషన్ 60 కేజీల విభాగంలో 5వ స్థానంలో నిలవడమే కాక, మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీల్లో సైతం గెలిచి శభాష్ అనిపించుకున్నాడు. పారిశ్రామిక ప్రాంతం ఎస్సార్‌కాలనీలో ఉంటున్న హేమంత్‌కుమార్ ఎక్కడ బాడీబిల్డింగ్ పోటీలు జరిగిన పతకాలు సాధిస్తూ వస్తున్నాడు.

ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు

నగరంలోని బుల్లయ్య కాలేజీలో బీఎస్సీ చదివిన హేమంత్‌కుమార్ తండ్రి గిన్ని తులసీరాజు హెచ్‌పీసీఎల్ పరిశ్రమలో రోజువారీ కార్మికుడిగా పనిస్తుండగా..తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హేమంత్‌కుమార్ పారిశ్రామిక ప్రాంతంలోని జాతీయ స్థాయి బాడీబిల్డర్ గౌరినాయుడు వద్ద శిక్షణ పొందాడు. 2020 నుంచి పోటీల్లో పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు.

అనుకున్నది సాధిస్తూ....

23 ఏళ్ల హేమంత్‌కుమార్ ఇప్పటి వరకూ 4 సార్లు మిస్టర్ విశాఖగా నిలవడమే కాక, 2023లో ఉత్తరాఖాండ్‌లో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో 60 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ నెల 4వ తేదీన నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో ఏపీ నుంచి హేమంత్‌కుమార్ అర్హత పొంది సుమారు 45 దేశాల క్రీడాకారులతో పోటీపడి భారతదేశాన్ని 5వ స్థానంలో నిలబెట్టాడు. భవిష్యత్తులో మిస్టర్ వరల్డ్ పోటీల్లో పాల్గొని భారత్ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నాడు. దాతలు, ప్రభుత్వం ప్రోత్సాహిస్తే రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధిస్తానని చెబుతున్నాడు.



నేపాల్‌లో గెలిచి తిరిగి విశాఖ వచ్చిన హేమంత్‌కుమార్‌కు ఘనస్వాగతం పలుకుతున్న తోటి బిల్డర్లు